TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | గురువారం మే 14, 2026 | సంపుటి : 01 సంచిక : 105 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM

## రెండు వాహనాల కాన్వాయ్‌తోనే

# మోదీ ప్రయాణం



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. రెండు వాహనాల కాన్వాయ్ తోనే ఆయన ప్రయాణించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ మేరకు మార్పులు చేశారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ.. స్వయంగా వాటిని పాటిస్తున్నారు. ఈక్రమంలోనే తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు. పేజి 2లో

- తమిళనాడు సీఎం విజయ్ బలపరీక్షలో విజయం
- విజయ్ ప్రభుత్వానికి 144 మంది ఎమ్మెల్యేల మద్దతు
- వ్యతిరేకంగా 22 ఓట్లు నమోదు
- బలపరీక్ష సమయంలో డీఎంకే సభ్యుల వాకౌట్
- కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ టీవీకేకు మద్దతు
- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కే అనుకూలం
- ఎమ్మెల్యేల కొనుగోలు ఆరోపణలు చేసిన పళనిస్వామి

# బలపరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్



తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ శాసనసభలోనూ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో నెగ్గింది. బలపరీక్షకు సంబంధించి ఈ ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ చేపట్టిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. ఇది ఆసక్తికరంగా సాగింది. సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా.. ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేసుకున్నారు.ఇందులో విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. బలపరీక్ష సమయంలో అసెంబ్లీ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా సీఎంకు అనుకూలంగా ఓటేశారు. పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో

# ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

## ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్

### సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్రోషాహి వెల్లడి



**ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్**

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్రోషాహి వెల్లడి**

హైదరాబాద్, మే 13: ప్రపంచ ప్రఖ్యాత రైడ్ షేరింగ్ సంస్థ ఊబర్ హైదరాబాద్‌లో విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. ఫ్యూచర్ సిటీలో తన కార్పొరేట్ ఆఫీసును ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన సమావేశమయ్యారు.

### హైదరాబాద్‌కే ఊబర్ ప్రాధాన్యం

హైదరాబాద్‌లో సాంకేతిక నైపుణ్యం, ప్రతిభకు కొరతలేదని, అందుకే ఇక్కడ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆవిష్కరణలు, ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నట్లు చెప్పారు.

**ఉద్యోగాల వెల్లడి**

ఈ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు.

**రాష్ట్రానికి పెట్టుబడులు**

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రోత్సాహం, పారిశ్రామిక అనుకూల వాతావరణం తమ నిర్ణయానికి కీలకమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి స్పందన**

ఊబర్ విస్తరణతో తెలంగాణ ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌గా మరింత ఎదుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

మిగతాది 2లో

## రైతుల ఖాతాల్లోకి రూ. 4,520 కోట్లు

### 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

### పౌరరఫరాల శాఖ అధికారుల వెల్లడి

2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. 2లో

## చెట్టును ఢీకొట్టిన బొలెరో.. ఒకరి మృతి, 29 మందికి గాయాలు



మిగతాది 2లో

## హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్..

# గిరిపుత్రుల్లో ఆనందం



- పెదపాడులో కొత్త పాఠశాల భవనం నిర్మాణం పూర్తి
- ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రూ.17.50 లక్షల వ్యయంతో ఆధునిక భవనం నిర్మాణం
- గతేడాది అడవితల్లి బాట కార్యక్రమంలో హామీ
- శిథిలావస్థలో ఉన్న పాత స్కూలును పరిశీలించిన పవన్
- ఉపాధ్యాయుల విజ్ఞప్తికి వెంటనే స్పందన
- 2026 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి భవనం
- పవన్‌కు కృతజ్ఞతలు తెలిపిన పెదపాడు గ్రామస్థులు

మిగతాది 2లో

# రజనీకాంత్ స్పీచ్..

*యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.*

# మంత్రి లోకేశ్ ఫిదా!



అమరావతి: బెంగుళూరులో జరిగిన 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ చేసిన ప్రసంగానికి మంత్రి నారా లోకేశ్ ఫిదా అయ్యారు. యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.“ఇవాళ ఉదయం లేవగానే మీ స్పీచ్ విన్నాను. అందులోని ప్రతి అంశం నాకు బాగా నచ్చింది. ఉన్నతస్థానంలో ఉన్న మీరు హుందాగా, వినయంగా స్టార్‌డమ్‌ను స్వీకరించే విధానం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉంది” అని పోస్టు పెట్టారు. పేజి 2లో ▶



# పొదుపు సూత్రాలు తెలంగాణకు

- నిధులు మాత్రం ఆంధ్రాకా ..?
- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్

మిగతాది 2లో

# సంపాదకీయం

## దక్షిణాపథంలో బీజేపీ జైత్రయాత్ర ఎప్పుడు?

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో కొన్ని దశాబ్దాల పాటు ఎర్ర కెరటాలు ప్రతి ఏటా ఉప్పొంగేవి. కానీ ఈ మే 9న కాషాయ అలలు పరవళ్లు తొక్కాయి. ప్రధానమంత్రి మోదీ, వేలాది ప్రజల సమక్షంలో సువేందు అధికారి బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా ఒక రోజు తర్వాత ఆదివారంనాడు దక్షిణాదిన చెన్నైలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సినీనటుడు చంద్రశేఖరన్ జోసెఫ్ విజయ్ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో తమిళనాడు 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పట్టాభిషేకానికీ అంతే భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకుని, పశ్చిమాన గుజరాత్, మహారాష్ట్రల్లో, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలో, తూర్పు, కోస్తా ప్రాంతంలో తొలుత ఒడిషా, ఇప్పుడు బెంగాల్‌లో విస్తరించిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో అడుగుపెట్టడం అంత సులభం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. అటు సువేందు అధికారి, ఇటు జోసెఫ్ విజయ్ ఈ పరిణామాలకు ప్రతిఫలనాల్లా కనిపిస్తున్నారు. ఈ రెండు ఘట్టాలు భారత దేశ ప్రజల ఆలోచనా దృక్పథంలో రెండు భిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయా?

బెంగాల్‌లో సువేందు అధికారి పక్కన నిలబడిన నరేంద్రమోదీ ఇప్పుడు దక్షిణాదిలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటే, కేరళలో విజయం సాధించి, జోసెఫ్ విజయ్ పక్కన నిలబడ్డ రాహుల్‌గాంధీ ఉత్తరాదిలో పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను ప్రతిఘటించిన దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఏమంత ఆహ్వానించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రవేశించేందుకు చేయని ప్రయత్నం లేదు. అమలు చేయని ప్రయోగం అంటూ లేదు.

ఏపీలో తెలుగుదేశం ఆధిపత్యాన్ని అంగీకరించిన బీజేపీ కర్ణాటకలో ఉన్న అధికారాన్ని కోల్పోయి, మళ్లీ పట్టుకోసం నానా యత్నాలు చేస్తోంది. తమిళనాడులో స్వంతంగా బలపడడం కష్టమని గ్రహించిన తర్వాత మళ్లీ అన్నాడీఎంకేతో చేతులు కలపక తప్పలేదు. కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి 3 సీట్లు సాధించిన బీజేపీ ఓట్ల శాతం మాత్రం గతంతో పోలిస్తే ఏమంత పెరగలేదు. కేరళ, తమిళనాడులో బీజేపీ ప్రవేశించడం సుదూర స్వప్నమైతే అవకాశం ఉన్న రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే కర్ణాటక, తెలంగాణల్లో మోదీ పర్యటన భిన్న రీతుల్లో సాగింది. కర్ణాటకలో జాతీయవాద రాజకీయాలవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని, త్వరలో కాషాయ ప్రభంజనం ఆ రాష్ట్రంలో వీస్తుందని చెప్పిన మోదీ తెలంగాణలో మాత్రం ఆ విశ్వాసాన్ని ప్రకటించలేదు.

1984లో దేశ వ్యాప్తంగా కేవలం బీజేపీ గెలుచుకున్న రెండు స్థానాల్లో ఒకటి గుజరాత్‌లోని మెహసానా కాగా, రెండవది తెలంగాణలో హన్మకొండ. ఇప్పుడు గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగా, తెలంగాణలో మాత్రం అనుకున్నంతమేరకు విస్తరించలేకపోతోంది. ఈ విషయాన్ని స్వయంగా మోదీయే రాష్ట్ర నేతల దగ్గర ప్రస్తావించి వారిని విమర్శించారు. బండి సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బీజేపీ కేడర్‌లో కొంత ఊపు వచ్చింది కాని ఆ తర్వాత ఆ ఉత్సాహం క్రమంగా నీరుకారిపోయింది. సంఘ్ పరివార్ సంస్థలైతే హిందుత్వ దిశగా ప్రజల్ని మళ్లించగలవు కాని రాజకీయంగా ప్రజల్లో కదలిక తేవాల్సింది బీజేపీ నేతలే. మోదీ తాజా పర్యటనలో బీజేపీ నేతలకు బహిరంగంగా ఎలాంటి దిశానిర్దేశం చేయలేదు. ఉత్తరాది, బెంగాల్‌లో అవలంబించిన పద్ధతులు దక్షిణాదిన పనిచేయవని ఆయనకు తెలుసు. అయితే తెలంగాణకు సంబంధించి మోదీ వద్ద ఏదో వ్యూహమే ఉన్నట్లు ఆయన మాటలు, సమావేశాలు అనుమానాలు కలిగిస్తున్నాయి. అదేమిటో కాలమే చెబుతుంది.

బెంగాల్‌లో బీజేపీ విజయంతో మమతా బెనర్జీ తర్వాత కమలనాథులను ఢీకొనగల శక్తులంతా ఒక్కొక్కరూ మాయవుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అయినా కనీసం బీజేపీని ఢీకొనగలదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించిన నాయకులు అందరూ ఒక్కొక్కరూ కుప్పకూలిపోయారు. నితీశ్‌కుమార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, కేసీఆర్, శరద్‌పవార్, కేజ్రీవాల్, ఉద్ధవ్ థాక్రే అందరూ మోదీని వ్యతిరేకించి ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకున్నవారే. 2023లో ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు తీవ్ర యత్నాలు చేసిన నితీశ్ తర్వాత అధికారం కోసం బీజేపీ వైపు మళ్లి, ఇప్పుడు బీజేపీకే అధికారాన్ని వదులుకున్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయగలిగిన నేతల నందరినీ మోదీ చతుర్విధోపాయాలు ఉపయోగించి పక్కకు తప్పించారు. వీరెవరూ జాతీయ స్థాయిలో ఇప్పుడు మోదీని ఎదుర్కోగలిగేందుకు చేయగలిగింది ఏమీ లేకపోగా, రాష్ట్ర స్థాయిలో మనుగడకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీని చీల్చి ప్రాబల్యం సంపాదించిన బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీలో కూడా తిరుగుబాటును ప్రేరేపించింది. తమిళనాడులో కొత్త శక్తి ఆవిర్భవించినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ శక్తి తన బలం ఎంతమేరకు పుంజుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. వామపక్షాలకు ఉన్న ఏకైక ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ వశమైంది. పార్లమెంటులో వామపక్షాల ఉనికి క్రమంగా క్షీణించిపోతోంది. ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు బలహీనపడంతో బీజేపీని కాంగ్రెస్ మాత్రమే ఒంటరిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బహుశా బీజేపీ కూడా అదే కోరుకుంటుందేమో. బీజేపీ వ్యతిరేక రాజకీయాలు బలహీనపడడమో, ఆవశ్యకత కోల్పోవడమో స్పష్టంగా కనపడుతోంది. అది నాయకత్వస్థాయిలోనూ, సైద్ధాంతిక స్థాయిలోనూ ప్రస్ఫుటిస్తోంది. దానివల్ల దక్షిణాదిలో కూడా బీజేపీతో చేతులు కలిపేందుకు, దాని రాజకీయ సిద్ధాంతాన్ని ఆమోదించేందుకు పార్టీలు ఏ మాత్రం వెనుకాడడం లేదు. బీజేపీ వ్యతిరేకత సోషల్ మీడియా కాగితపు పులులకు మించి జనంలోకి వ్యాపించేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేము.

స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీనపడింది. అప్పుడు జనసంఘ్, బీజేపీ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే విధంగా మారింది. కేవలం రెండేళ్లలో బీజేపీ తూర్పున ఒడిషా, బిహార్, పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి రాగలిగింది. అసోంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో బీజేపీకి స్వంత ముఖ్యమంత్రులున్నారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. ఒక్క జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప హిందీ బెల్ట్ అంతటా బీజేపీ ముఖ్యమంత్రులున్నారు. పంజాబ్‌లో కూడా ఇప్పటికే బీజేపీ చాపక్రింద నీరులాగా ప్రవేశించేందుకు పథకాలు మొదలుపెట్టింది. ఉత్తర, తూర్పు, పశ్చిమాన ఆధిపత్యం నిరూపించుకోగలిగిన బీజేపీకి దక్షిణాదిలో ప్రవేశించడం అసాధ్యమా?

అయితే ఎన్నికల రాజకీయాల్లో బీజేపీ ఎంత తలపండిపోయిందంటే ఆ పార్టీని ఓడించడం అసాధ్యమనే స్థితి ఏర్పడింది. ఎన్నికల్లో బీజేపీ విజయ సూత్రాన్ని ఎవరూ ఛేదించలేకపోతున్నారు. గెలిచేందుకు ఏ సాధనాన్ని బీజేపీ వదిలిపెట్టదు, అది నైతికమా, అనైతికమా అన్న చర్చతో ఆ పార్టీకి నిమిత్తం లేదు. 'సర్' వల్ల 31 స్థానాల్లో బీజేపీ తమపై గెలిచిందని తృణమూల్ కాంగ్రెస్ నేతలే అంగీకరించినందువల్ల మిగతా స్థానాల్లో గెలిచేందుకు బీజేపీ ఇతర వ్యూహాలు ప్రయోగించి ఉండాలి.

ఏ పార్టీకైనా ఎల్లకాలమూ శిఖర స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. బీజేపీ ఆ స్థాయి కోల్పోవాలంటే తన పతనానికి తానే కారణం కావాలి. ఆ పార్టీని గద్దెదించగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవిర్భవించాలి. ప్రజలు అడుగడుగునా వ్యతిరేకించగల పరిస్థితులు రావాలి. ఈ మూడూ సమీప భవిష్యత్తులో జరిగే అవకాశాలు కనపడడం లేదు. సాధారణంగా ప్రభుత్వ పాలన పట్ల కనపడే వ్యతిరేకతను కూడా బీజేపీ అధిగమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలు. అసోంలో రెండుసార్లు అధికారంలో ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ బీజేపీని

## రజనీకాంత్ స్పీచ్.. మంత్రి లోకేశ్ ఫిదా!

మొదటిపేజీ తరువాయి

**రజనీకాంత్ ఏమన్నారంటే?**

"హిమాలయాల తర్వాత ఈ ఆశ్రమం నాకు ఎంతో నచ్చింది. నిజానికి నేను ఇక్కడ రెండ్రోజులు ఉందామని ప్లాన్ చేశాను. కానీ 15 రోజులు ఉండిపోయాను. ఒక రోజు సాయంత్రం ఆశ్రమంలో భక్తులు వేల సంఖ్యలో ఉన్నారు. అప్పుడు గురుదేవ్ (శ్రీ శ్రీ రవిశంకర్) పిలుపు మేరకు నేను కూడా ఆయనతో కలిసి వేదికపైకి వెళ్లాను. నేను మీతో వస్తే మీకు డిస్టర్బ్ అవుతుంది కదా అని అడిగితే, ఆయన ఏం ఫర్లేదు అన్నారు. అక్కడున్న వేల మంది జనాన్ని, ముఖ్యంగా ఎంతో మంది తమిళ భక్తులను చూసి కొంచెం కంగారు పడ్డాను. అందరూ నన్ను చుట్టుముట్టేస్తారేమో, ఫొటోలు, ఆటోగ్రాఫ్‌ల కోసం వెంటబడతారేమో అని భయపడ్డాను. కానీ, ఆశ్చర్యంగా, ఒక్కరు కూడా నన్ను పట్టించుకోలేదు. అందరి దృష్టి గురుదేవుల మీద మాత్రమే ఉంది. నేను హాయ్ అని చేతులు ఊపినా ఎవరూ చూడలేదు. నా జీవితంలో ఎంతో మంది రాజకీయ నాయకులను, పారిశ్రామికవేత్తలను చూశాను, కానీ, ఇంతటి అనుభవం ఎప్పుడూ కలగలేదు. అది నా గర్వాన్ని (ఈగోని) పూర్తిగా అణచివేసింది. అప్పుడు అర్థమైంది, సెలబ్రిటీ హోదా అనేది వస్తుంటుంది, పోతుంటుంది. కానీ ఆధ్యాత్మికతలో ఉండే ఈ హోదానే అత్యున్నతమైనది" అని రజనీకాంత్ అన్నారు.

## అమరావతే కాదు.. విశాఖనూ విశ్వనగరం చేస్తున్నాం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుంది.

విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుంది." అని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు

మొదటిపేజీ తరువాయి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్‌ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్‌ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్‌ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

## రైతుల ఖాతాల్లోకి రూ. 4,520 కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ల్గ÷తులు సన్న మరియు దొడ్డ రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి మరియు రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు మరియు గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో

## రెండు వాహనాల కాన్వాయ్‌తోనే మోదీ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా, ప్రధాని కాన్వాయ్‌లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12–15 వాహనాలు ఉంటాయి. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు ఉదయం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు.

**కాన్వాయ్ సైజును కుదించుకున్న కేంద్రమంత్రులు**

ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నట్లు వెల్లడించారు.

## బలపరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్

మొదటిపేజీ తరువాయి

**అన్నాడీఎంకే జం అన్నాడీఎంకే**

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.

**రీల్ ప్రభుత్వం: ఉదయనిధి స్టాలిన్**

ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది" అని ఉదయనిధి విమర్శించారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

**హామీలన్నీ నెరవేరుస్తాం: విజయ్**

చివర్లో విజయ్ మాట్లాడారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. "మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది" అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి (రాజకీయం)గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

## హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్..

మొదటిపేజీ తరువాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదపాడులో పాఠశాల భవనం నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెరవేర్చారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 7న అరకు నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగూడ మండలం, పెదపాడు గ్రామంలో అడవితల్లి బాట కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. చాపరాయి నుంచి పెదపాడు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆ గ్రామంలో మౌలిక వసతులపై ఆరా తీశారు.

పెదపాడులో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. స్కూలు భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనం కావాలని ఉపాధ్యాయులు రంగయ్య.. పవన్‌కు విన్నవించారు. పాఠశాలకు కొత్త భవనం నిర్మిస్తామని పవన్ సభావేదికపై హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు పాఠశాల భవనాన్ని నిర్మించారు. 2026 విద్యా సంవత్సరం నుంచి ఇది విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇచ్చిన హామీని నెరవేర్చటంపై పెదపాడు గ్రామస్థులు పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చెట్టును ఢీకొట్టిన బొలెరో.. ఒకరి మృతి, 29 మందికి గాయాలు

మొదటిపేజీ తరువాయి

గండేపల్లి, పెద్దాపురం: సరదాగా బంధువుల వివాహానికి వెళ్లారు. వివాహాన్ని కనులారా చూసి బంధువులతో ఆనందంగా గడిపి తిరిగి వస్తుండగా వారు వస్తున్న వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం ఆర్బీ కొత్తూరు గ్రామానికి చెందిన కొల్లి సత్యవేణి, గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన పెళ్లికుమారుడి ఇంటికి పెళ్లికి వెళ్లారు. వివాహం జరిగిన తర్వాత తిరిగి వస్తుండగా నాయకంపల్లి శివారు మలుపులో ఒక్కసారిగా ఏదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయే క్రమంలో బొలెరో వాహనం అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనున్న పామాయిల్ తోటలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమమంలో వాహనంలో 30 మంది ఉండగా.. డ్రైవర్ సోదరుడు అనూరు గ్రామానికి చెందిన వసంత్ (13) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 29 మందికి గాయాలయ్యాయి. వారిలో 27 మందిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మరో ఇద్దరు పెదాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

మొదటిపేజీ తరువాయి

**వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్**

తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు.

ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి.

# గీతంలో పాఠశాల విద్యార్థుల కోసం యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్.

**సంగారెడ్డి,మే 13,మన మహతి న్యూస్ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ (వీడీసీ) 8 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం మూడు రోజుల యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్ (వైఎల్పీ) స్టార్టప్ బూట్ క్యాంపును నిర్వహించనుంది. ఈ కార్యక్రమం అనుభవపూర్వక, కార్యాచరణ-ఆధారిత అభ్యాసం ద్వారా యువ అభ్యాసకులలో వ్యవస్థాపక ఆలోచనా విధానం, సృజనాత్మకత, నాయకత్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో పాల్గొనేవారు ఆరు వేల రూపాయలతో పాటు జీఎస్టీని కూడా చెల్లించాల్సి ఉంటుంది.

వైఎల్పీ ఒక ప్రాక్టికల్, పూర్తిగా లీనమయ్యే బ్యూట్ క్యాంపు. ఇది విద్యార్థులకు అవకాశాలను గుర్తించడం, వినూత్న ఆలోచనలను అభివృద్ధి చేయడం, స్టార్టప్ వ్యవస్థాపకుల వలె పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడటం ద్వారా, వారికి వ్యవస్థాపకత యొక్క ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తుంది. సాంప్రదాయ తరగతి గది అభ్యాసానికి భిన్నంగా, ఈ కార్యక్రమం బృంద ఆధారితమైన, ముఖాముఖిగా కొనసాగి, ఆచరణాత్మక అనుభవంపై దృష్టి పెడుతుంది.

వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో వ్యవస్థాపక నైపుణ్యాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ, భవిష్యత్ విజయానికి విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, భావప్రకటన, దృఢత్వం, ఆవిష్కరణ వంటి లక్షణాలు అత్యవసరం అయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రారంభ దశలోనే ఆయా నైపుణ్యాలను సమకూర్చి, వారిని ఆత్మవిశ్వాసం కలిగిన నాయకులుగా, మార్పు తీసుకువచ్చే వారిగా తీర్చిదిద్దేలా రూపొందించారు.

ఈ మూడు రోజుల బ్యూట్ క్యాంపులో వ్యవస్థాపక మనస్తత్వం, అవకాశాలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, వ్యాపార నమూనాలు, వినియోగదారులను అర్థం చేసుకోవడం, స్టార్టప్ ఆలోచనను అభివృద్ధి చేయడం, కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, పిచింగ్ టెక్నిక్ లను వివరించే ఒక క్రమబద్ధమైన పాఠ్యప్రణాళికతో సాగనుంది.

తొలి రోజున, విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వం, వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, బృంద ఏర్పాటు, ఆలోచనల మథనం వంటి అంశాలపై జరిగే సెషన్ల ద్వారా 'వ్యవస్థాపకుడిగా యోచించడం' నేర్చుకుంటారు. 'మీ ఆలోచననురూపొందించుకోండి' శీర్షికన జరిగే రెండవ రోజు సెషన్, వ్యాపార నమూనాలను అర్థం చేసుకోవడం, వినియోగదారుల అవసరాలు, స్టార్టప్ ఆలోచనలను మెరుగుపరచడం, ఒక సరళమైన స్టార్టప్ కాన్వాస్ ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. ఇక మూడవ రోజు, 'ఆత్మవిశ్వాసంతో ఏర్పాటు చేయండి' అనే కార్యక్రమంలో పాల్గొనేవారికి కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, ప్రశ్నలను ఎదుర్కోవడం, 'షార్క్ ట్యాంక్'-శైలి పిచ్ సెషన్లో ఒక ప్యానెల్ ముందు తమ స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించడం వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు.

ఈ కార్యక్రమం ముగిసేనాటికి, ఇందులో పాల్గొనేవారు వ్యవస్థాపక మనస్తత్వం, మెరుగైన విమర్శనాత్మక ఆలోచనా సామర్థ్యాలు, జట్టు కృషి, సహకార నైపుణ్యాలు, బహిరంగ ప్రసంగంలో ఆత్మవిశ్వాసం, ఇంకా బూట్ క్యాంప్ సమయంలో అభివృద్ధి చేసిన ఒక క్రమబద్ధమైన స్టార్టప్ ఆలోచనను పొందుతారు. అలాగే దీనిని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులు గీతం వీడీసీని నుంచి ఒక ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందుకుంటారు.

స్టార్టప్ లు, ఆవిష్కరణలు, వ్యాపారం, సృజనాత్మక సమస్య పరిష్కారం, నాయకత్వం, భావప్రకటనా నైపుణ్యాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుంది. అంతే కాకుండా, ఇది యువ అభ్యాసకులకు విశ్వవిద్యాలయ ప్రాంగణ జీవితంపై విలువైన అవగాహనను, గీతం వీడీసీతో అనుబంధం ఉన్న నిపుణుల నుంచి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మరిన్ని వివరాల కోసం వీడీసీ ఉప సంచాలకుడు మహేష్ వారియర్ ం91 9036217587ను, లేదా ఎఌఖతీఅవతీఏస్త్రఖ్ఝఎ.వంఎబ కు ఈ-మెయిల్ చేయడం ద్వారా గానీ సంప్రదించవచ్చు.

# మేడ్చల్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

- రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి -- జిల్లా కలెక్టర్ తరపున విజ్ఞప్తి
- ఘట్ కేసర్ మండలంలో ఐదు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు -- ఇప్పటివరకు 638 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 13**





మేడ్చల్ జిల్లాలో రవి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఘట్కేసర్ మండలంలో రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్, ఘట్కేసర్ ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు ఎదులాబాద్, మాదారం, ప్రతాప్ సింగారం, అంకుషాపూర్ మరియు ఔషాపూర్ గ్రామాలలో ప్రారంభించబడ్డాయి.

జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరి ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా రైతుల నుండి 638 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా, మాదారం మరియు ఎదులాబాద్ కేంద్రాల ద్వారా 223 టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం, నిల్వ, రవాణా తదితర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గారి తరపున విజ్ఞప్తి చేశారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు కేంద్ర

# ఇంత నిర్లక్ష్యమా.

- జక్లేర్ చెరువు కట్టపై అధ్వానంగా మారిన రహదారి.
- రెండేళ్లుగా పట్టించుకోని పాలకులు
- సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్.

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్.**



మండల పరిధిలోని జక్లేర్ చెరువు కట్టపై గల రహదారి కంకర తేలి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రెండేళ్లుగా పాలకులు,అధికారులు పట్టించుకోవడంలేదని . సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ రహదారిపై నిరంతరం అనేక రకాల వాహనాలు ప్రయాణిస్తుంటాయని ద్విచక్ర వాహనాలు,ఆటోలలో ప్రయాణించే వారికి నరకప్రాయంగా మారిందని ఈ రహదారికి మరమ్మతులు ఎప్పుడు చేస్తారో తెలియ పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రహదారి వెంబడి అధికారులు,ప్రజాప్రతినిధులు తిరుగుతున్న చీమకుట్టినట్లు కూడా కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు.అంతర్ రాష్ట్ర రహదారి నుంచి నిరంతరం పులిమామిడి మీదుగా బిజ్వార్ అంబాత్రేయ క్షేత్రానికి అదేవిధంగా ఊట్కూర్,పెద్ద జత్రం గేట్,ధన్వాడతో పాటు జిల్లా కేంద్రానికి కర్ణాటక తదితర ప్రాంతాలకు అటువైపుగా మక్తల్, రాయచూర్,ఆత్మకూర్, వనపర్తి,ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాదుకు నిరంతరం ప్రజలు ప్రయాణిస్తుంటారని తెలిపారు.ఈ రహదారిపై అనేకసార్లు ప్రమాదాలు జరిగాయని రహదారిపై ప్రయాణించాలంటేనే వెన్నులో వణుకు పుడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారికి మరమ్మతులు చేపట్టకపోతే ప్రజలను సంఘటితం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని మహేష్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించాలంటే ఉపాధి ఆధారిత శిక్షణ ఎంతో అవసరం

బీబీనగర్ మండల పరిధిలోని రాయరావుపేట గ్రామంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బొర్ర రమేష్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టిమిషన్ శిక్షణ మరియు బ్యూటిషియన్ కోర్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించాలంటే ఉపాధి ఆధారిత శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. కుట్టుమిషన్ మరియు బ్యూటిషియన్ కోర్సుల ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగి,స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు దోహదపడుతుందని అన్నారు.మహిళల అభివృద్ధి కోసం కుంభం ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమని కుంభం ఫౌండేషన్ ఎప్పుడు సహకారం అందచేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళ్ రెడ్డి ,పొట్టోల శ్యామ్,పిఏసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి,నాయకులు మాజీ ఎంపిటిసిలు సుభాష్ రెడ్డి,మన్నే బాలరాజు,సర్పంచులు పంజాల శ్రీనివాస్ గౌడ్,బండారి మహేందర్,నాయకులు రంగోళ్ళ వంశీ,రంగోళ్ళ సతీష్ఉపసర్పంచ్ శివ గౌడ్,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం వాసుదేవ రెడ్డి,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను నిఖిల్ రెడ్డి,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పలంచి శ్రీకాంత్,వార్డ్ సభ్యులు,గ్రామ నాయకులు,మహిళా సంఘాల సభ్యులు,యువతులు తదితరులు పాల్గొన్నారు.

# నాగరం, రాంపల్లి చెరువులకు 'గుర్రపు డెక్క' కష్టాల నుండి విముక్తి

- కాంగ్రెస్ నేతల చొరవతో మొదలైన ప్రక్షాళన పనులు
- పనులను స్వయంగా పర్యవేక్షించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌకుట్ల జీవన్ రెడ్డి





**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం, మే 13:**

నాగారం మున్సిపల్ పరిధిలోని నాగారం మరియు రాంపల్లి చెరువులలో దీర్ఘకాలంగా ప్రజలను వేధిస్తున్న గుర్రపు డెక్క సమస్య ఎట్టకేలకు పరిష్కార మార్గంలో పడింది. నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి మరియు యువజన నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి ల నిరంతర కృషి, పర్యవేక్షణతో ఈ ప్రక్షాళన పనులు వేగవంతం అయ్యాయి.

**వినతిపత్రానికి స్పందన:**

చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా దోమల ఉధృతి పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటోందని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ రెండు నెలల క్రితం ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్కు నేతలు వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీమతి వాణి రెడ్డి, యుద్ధ ప్రాతిపదికన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

**క్షేత్రస్థాయిలో తనిఖీ:**

బుధవారం రాంపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ముప్పు శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "ప్రజల ఆరోగ్యం మాకు ముఖ్యం. చెరువులు పూర్తిగా శుభ్రపడే వరకు విశ్రమించం. పనులు నాణ్యంగా, త్వరగా పూర్తయ్యేలా రోజువారీ పర్యవేక్షణ కొనసాగిస్తాం."

**పాల్గొన్న ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంగ సంతోష్, ఆల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మజేటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు మరియు అసోసియేషన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. చెరువుల ప్రక్షాళనకు చొరవ చూపిన నాయకులకు స్థానిక కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ సన్మానించిన బేరీ రామచంద్ర యాదవ్

**శేర్లింగంపల్లి మన మహతి న్యూస్ మే 13**





శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్ ను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నియమించిన సందర్భంగా బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరీ రామచంద్ర యాదవ్ బృందం సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రఘునాథ్ యాదవ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కావడం, పార్టీ గెలుపు కోసం కృషి చేసిన సందర్భంగా ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ చైర్మన్ నియమించడం జరిగింది. సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరీ రామచంద్ర యాదవ్ బృందం ఘనంగా సన్మానించడం జరిగింది. కొండాపూర్ లోని ఆయన కార్యాలయంలో శాలువాతో పూల బోకేతో ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తో పాటు అందెల కుమార్ యాదవ్, సెక్రటరీ హరికృష్ణ చారి, శ్రీనివాస్ యాదవ్, శివ యాదవ్, రమేష్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ తదితరులు పాల్గొని రఘునాథ యాదవ్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన యాదవుల అభివృద్ధికి పాటు పడాలని బేరి రామచంద్ర యాదవ్ కోరారు. మారు మూల గ్రామాల్లో ఉన్న యాదవుల అభివృద్ధి కోసం కృషి చేయాలని, యాదవ కార్పొరేషన్ ద్వారా నిధులు వచ్చేలా చూడాలని, ఆ నిధుల ద్వారా యాదవుల సంక్షేమానికి పాటు పడాలన్నారు.

# ములుగు నుండి పోరాట గొంతుకలు వచ్చే ఎన్నికల నాటికి పరార్ కానున్నారు

**దేవా నాయక్ లంబాడా న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు**



ఉద్యమ నాయకులు పోరాట గొంతుకలు ప్రస్తుతం ములుగు జిల్లా లో మూగ నోము పాటిస్తున్నారు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు ఎన్నికల సమయం లో తనకు అండగా ఉంటారని భావించిన ప్రతిపక్ష నేతలు క్రమ క్రమంగా దూరమవుతున్నారు కొన్ని ప్రాంతాలలో తన జాతి వ్యతిరేకులకు విధి లేక టికెట్స్ కేటాయించడం వారు గెలువడం సజావుగా జరిగిపోయింది అసెంబ్లీ ఎన్నికలలో ఎట్టి పరిస్థితి లో వారు సపోర్ట్ చేయరని పోరాట గొంతుకలకు తెలిసిపోయింది కిమ్మనలేక మౌనం పాటించక తప్పడం లేదు అందుకే ములుగు అసెంబ్లిని వదిలి మరోచోట పోటీ చేయడానికి మార్గాలు వెతుకు చున్నట్లు గా ప్రజలకు తెలిసిపోయిందని దేవా నాయక్ జ్యోస్యం చెప్పు చున్నారు

తన జాతి లో నుండి ఈ నియోజక వర్గం తో సంబందాలు కలిగి మంచి పలుకుబడి ప్రజాభిమానం ఉన్నవారు సౌమ్యులు గా పేరున్న వారు ములుగు అసెంబ్లీ కి సన్నద్ధ మౌతున్నట్లు తెలిసి ఉద్యమ గొంతుకలు నోరు మెదపడం లేదని

దేవా నాయక్ వివరించుచున్నారు పోరాట గొంతుకల ఎత్తుగడలను ప్రజలు మాజీలు నమ్మే పరిస్థితులు లేవని తెలిసింది ములుగుప్రజలు ఎట్టి పరిస్థితుల్లో తనను నమ్మడం లేదని ఇప్పటికే గమనించిన పోరాట గొంతుకలు ములుగు నుండి పారిపోవడానికి సిద్ధమైనట్లు ప్రజలకు తెలిసి పోయింది ఈ నియోజక వర్గం వదిలిపారి పోయే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయనిదేవా నాయక్ తెలిపారు తను నమ్ముకున్న గాడ్ ఫాదర్ మొఖం చాటేయడం టీడీపీ బలం ములుగు జిల్లా లో పెరుగడం బీజేపీ టీడీపీ పొత్తుకు ములుగు జిల్లాలో అడుగులు పడు చున్నాయని మొన్న వచ్చిన ప్రధాని మోడీ గారు చంద్రబాబు నాయుడు గారి తో కలిసి అదే సంకేతం ఇచ్చారని ప్రజలకు పార్టీలకు తెలిసిపోయింది ప్రజా గొంతుకలకు ఇది మింగుడు పడని అంశం గా భావిస్తున్నారు కాంగ్రెస్ భారత దేశంలో గెలిచేది లేదు ప్రజా గొంతుకలకు ఉన్న రాష్ట్రపతి కల నెరవేరేది లేదు అని దేవా నాయక్ పూర్తి నమ్మకంగా తెలియ జేస్తున్నారు

ములుగు జిల్లా లో ఉన్న ప్రజా వ్యతిరేకత డబ్బులతో గతం లో రాజకీయ నాయకులను కొనడానికి వీలు కలుగింది ఇప్పుడు ఆ పరిస్థితులులేవు రాజకీయ మోసం ప్రజలకు తెలిసిపోయింది ప్రజా గొంతుకలు మూగ బోవడం ఖాయం శాశ్వతం ఇది నిజం ఎల్ల కాలం ప్రజలను మోసం చేయడం సాధ్యం కాదు అని పోరాట గొంతుకలు తెలుసు కుంటే మంచిది అని దేవా నాయక్ హితవు పలికారు

తన వారికి పదవులు కేటాయిస్తే ప్రజల పై రౌడి యిజం చెలాయిస్తూ దోపిడీకి అరాచకాలకు పాల్పడుచున్న నోరు మెదపడం లేదని వారు చేస్తున్న పాపం పోరాట గొంతుకలకు శాపం గా పరిణ మిస్తుందని దేవా నాయక్ హెచ్చరించారు

# జనగణనలో బిసి గణన చేయాలి



పరిగి శ్రీకృష్ణ హోటల్ యందు జరిగిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమంతు ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ , పరిగి నియోజకవర్గం బిసి జేఏసీ అధ్యక్షులు సదానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ అడ్వకేట్, పీర్ మహమూద్ మాట్లాడుతూ... ఇటీవల ప్రారంభమైన జనగణనలో వెనుకబడిన తరగతుల బ్యాక్ వర్డ్ క్లాసెస్ బీసీ జనాభాను లెక్కించకపోవడం పట్ల బి.సి. జేఏసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాబోయే జనగణనలో తప్పనిసరిగా బి.సి.ల జనాభా లెక్కింపు చేపట్టాలని మా సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.బి.సి.ల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా అంచనా వేయాలంటే కుల ఆధారిత జనగణన అత్యంత అవసరం. సరైన గణాంకాలు ఉంటేనే ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుంది. అని తెలిపారు.అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బి.సి.లకు 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని కూడా మా ప్రధాన డిమాండ్. బి.సి.లకు వారి జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో అవసరం అని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని రాబోయే జనగణనలో బి.సి. జనాభా లెక్కింపును బీసీ లు ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బి.సి. రిజర్వేషన్ల అమలును వెంటనే చేపట్టాలని బి.సి. జేఏసీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలాపూర్ సర్పంచ్ పులేందర్, బీసీ నాయకులు సుల్తాన్పూర్ వెంకటయ్య, ఎక్స్ సర్వీస్ మెన్ లింగమయ్య, వెంకటేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఎస్.ఆర్ కాలనీలో ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసిన మిండా హారిబాబు







అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో పదోవ వార్డులో ఏ,ఎస్,ఆర్ కాలనీ వద్ద విద్యుత్ సమస్యకు మెరుగైన పరిష్కారాన్ని పదవ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు పరిష్కార మార్గాన్ని చవిచూశారు,

తన వార్డులో సమస్యలు పరిష్కారానికి పరిపూర్ణం కాకూడదని లక్ష్యంతో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ సమస్యను పరిష్కరించాలని చైర్మన్ కు వైస్ చైర్మన్ కు పటిష్ట నివేదికను అందజేయడంతో స్థానిక శాసనసభ్యులు పదవ వార్డు సమస్య పై చొరవ తీసుకున్నారు,

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ఏఈ వెంకట్ సంఘటన స్థలానికి చేరుకొని సమస్యపై పరిపూర్ణంగా పరిశీలించారు, తక్షణమే 100 కిలో వాట్ల ట్రాన్స్ఫారం పదో వార్డు సమీపంలో ఏర్పాటు చేసి దిగువ విద్యుత్, నాసిరకపు విద్యుత్తుకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేశారు,

పదో వార్డు కౌన్సిలర్ నిండా హరిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటిసారి మున్సిపాలిటీ పరిధిలో వార్డు అభ్యర్థిగా విజయం సాధించడం సంతోషంగా ఉందని, ప్రజా సమస్యలపై పోరాడటానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని, తన వార్డులో సమస్యపై మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్, శాసనసభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు స్పందించటం మహాదానందంగా ఉందని మిండా హరిబాబు తెలియజేశారు, ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసే కార్యక్రమంలో, ఏర్పాటు చేసే విధినిర్వహణలో దయాకర్, కరుణ, రాజ్ కుమార్, మస్తాన్, హుస్సేన్, బాలాజీ, రాంబాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మారుతి కిరణ్ బూనేటీ



బిజెపి సీనియర్ నాయకులు శేరి రామ్ రెడ్డి అక్క కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీ కిరణ్ బూనేటి.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మోత్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ కేశవ్ ,పరిగి అసెంబ్లీ కన్వీనర్ నరసింహ,పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ , బిజెపి సీనియర్ నాయకులు నస్కల్ వెంకటయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన డా.టి.రితిక్ రెడ్డి



మహమ్మదాబాద్ మండలం మోకర్లాబాద్ గ్రామంలో నిర్వహిస్తున్న జయ చందర్ స్మారక క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్‌ను స్థానిక నాయకులతో కలిసి యువ నాయకులు, పిసిసి మెంబర్ డాక్టర్ టి.రితిక్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి తొలి మ్యాచ్‌ను ప్రారంభించినారు. క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు.యువత క్రీడల్లో రాణిస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కే.ఎం.నారాయణ స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల పటిష్టతకై విద్యా వారోత్సవాలు

**మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్**




విద్యాసంస్థల అభివృద్ధి పటిష్టత కోసం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు .పరిగి పట్టణంలోని ఓగా కాలేజీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలను నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ రజిత వెంకటేష్,ఐదవ వార్డు కౌన్సిలర్ షాహిదా బేగం, 2వ వార్డు కౌన్సిలర్ ఆరిఫ్ పటేల్ లు హాజరయ్యారు.

చైర్ పర్సన్ మాట్లాడుతూ..

ప్రజా పాలనలో అన్ని రంగాలలో కంటే విద్యారంగానికి ఎక్కువ ప్రాధాన్య ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే డా" టి.రామ్మోహన్ రెడ్డి కృషితో పరిగిలో రూ200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. విద్యాసంస్థల అభివృద్ధికి తోడ్పాటు అందించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిపిఓ జయసుధ,ఎంఈఓ అంజయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖాన్ దొడ్డి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గ్రహప్రవేశం.కార్యక్రమంలో పాల్గొన్న వాకిటీ లలితమ్మ



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలంలో ఖాన్ దొడ్డి గ్రామంలో.కుమ్మరి ఆంజనేయులు లక్ష్మి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంల్లు గృహప్రవేశం కార్యక్రమానికి హాజరైన మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇట్టి కార్యక్రమంలో కృష్ణ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ సర్పంచ్ సంగోళ్ళ వెంకటేష్ ఉప సర్పంచ్ దుకాణం శ్రీనివాస్ , కృష్ణ మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్ పంచాయతీ సెక్రటరీ శివరాజ్ జి .వెంకటేష్ మల్లికార్జున్, మక్తల్ కాంగ్రెస్ నాయకులు బోయ రవి, నాగేంద్ర కున్సి ,నాగరాజ్ ,ఓబులేష్ ,నాగేశ్వరరావు తమప్ప ,తాయప్ప ,చిన్న తాయప్ప , వి తాయప్ప, ఉజూర్ ,తారేష్, అశోక్ ,హన్మేష్ కాంగ్రెస్ నాయకులు,తదితరులు, హాజరు కావడం జరిగింది.గృహ ప్రవేశం చేసుకున్న దంపతులకు వాకిటి లలిత నూతన వస్త్రాలు బాహూకరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రానున్న రోజుల్లో ఆత్మకూరు ప్రజల దశాబ్దాల గల నెరబోతుంది

**రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

జూరాల వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా 123 కోట్ల తో కృష్ణా నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను మంత్రి పరిశీలించారు.ఆత్మకూరు ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని మంత్రి తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గద్వాల ఆత్మకూర్ మున్సిపాలిటీల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు.ఈ వర్షాకాలం లోపు పిల్లర్ నిర్మాణాలు పూర్తయి ఏడాది లోపు వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హైదరాబాద్ మీదుగా వయా ఆత్మకూరు గద్వాల్,రాయచూరు నుండి మంత్రాలయం వరకు దాదాపు 60 కిలోమీటర్ల దూరం తక్కువ అవుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితేఆత్మకూరు ఇకపై కనెక్టివిటీ మున్సిపాలిటీ అవుతుందని మంత్రి శ్రీహరి గారు స్పష్టం చేశారు.

## మొక్కజొన్న కొనుగోలు ఆలస్యమైతే కఠిన చర్యలు.



మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.

నర్వ మండలం లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద జరుగుతున్న తీరును మంత్రి పరిశీలించారు. గన్ని బ్యాగుల కొరత మంత్రిగారి దృష్టికి తేగా వెంటనే మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీలత గారికి ఫోన్ చేసి గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని మంత్రిగారు ఆదేశించారు. మొక్క జొన్న కొనుగోలు ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి వాకిటి శ్రీహరి గారు అధికారులను హెచ్చరించారు.కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# శ్రీను వైట్లతో శర్వానంద్ మూవీ



టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' కుటుంబ ప్రేక్షకులను అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇటీవల విడుదలైన మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన 'బైకర్' కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఈ విజయాల ఊపుతో శర్వానంద్ ఇప్పుడు వరుసగా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ నటిస్తున్నారు. 1960ల నాటి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా కనిపించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు శర్వానంద్ తన తదుపరి చిత్రాన్ని హాస్య కథా చిత్రాల దర్శకుడు శ్రీను వైట్లతో చేయడానికి సిద్ధమైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో శ్రీను వైట్ల మార్క్ కామెడీకి తోడు 'కాలయానం' అనే వైవిధ్యమైన అంశాన్ని జోడిస్తున్నట్లు సమాచారం. హాస్యంతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలు కలిస్తే ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వారు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని సమాచారం. ఇప్పుడు ఈ చిత్రాన్ని నిర్మాత అనిల్ సుంకర తన నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. 'నారీ నారీ నడుమ మురారి' తర్వాత శర్వానంద్-అనిల్ సుంకర కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొన్నాయి.జులై 2026 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ ఎంపిక విషయంలో కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది. తొలుత పూజా హెగ్డే, మమితా బైజు పేర్లు వినిపించినా, తాజా సమాచారం ప్రకారం మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న ఈ తెలుగమ్మాయి, శర్వానంద్ సరసన నటించేందుకు అంగీకరించినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.ఒకవేళ ఇదే నిజమైతే శర్వానంద్-మానస జోడీ వెండితెరపై కొత్త ఫీల్‌ను తీసుకురావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కథా పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే చిత్రబృందంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# భర్తతో విడిపోతున్నట్టు రూమర్లు.. స్పందించిన నటి మౌనీరాయ్



తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్- మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.

# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది మూవీ
## దంగల్‌తో పోల్చకుండా జాగ్రత్తలు





ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.

# బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా

బుట్టబొమ్మ పూజా హెగ్డే కు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ఫ్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్ .. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.




# కన్నడసీమలో తీవ్ర విషాదం
## గుండెపోటుతో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ మృతి



కన్నడ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో ఉన్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిలీప్ రాజ్ మృతితో శాండల్‌వుడ్ దిగ్భ్రాంతికి గురైంది. ఈ వార్త తెలుసుకున్న 'కాంతార' నటుడు రిషబ్ శెట్టి సోషల్ మీడియా వేదికగా దిలీప్ రాజ్‌కు నివాళులు అర్పించారు. 'ఒక మంచి నటుడు, దర్శకుడు, నిర్మాత.. అన్నింటికీ మించి ఒక అద్భుతమైన మనిషి. మనం కలిసిన సందర్భాలు తక్కువైనా, మీ వ్యక్తిత్వం నా గుండెల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేసింది. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ రిషబ్ శెట్టి ఎమోషనల్ పోస్ట్ చేశారు.దిలీప్ రాజ్ కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా కన్నడ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పునీత్ రాజ్‌కుమార్ నటించిన 'మిలనా' చిత్రంలో ఆయన పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచింది. 'యు-టర్న్', 'బాయ్‌ఫ్రెండ్' వంటి పలు విజయవంతమైన సినిమాలతో పాటు 'హిట్లర్ కళ్యాణ' వంటి పాపులర్ సీరియల్స్‌లోనూ ఆయన నటించారు. ఆయన మృతి పట్ల కన్నడ సినీ ప్రముఖులు మరియు అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# కేన్స్‌లో అలియా కామెంట్స్.. నెట్టింట విమర్శలు



బాలీవుడ్ అగ్ర కథానాయిక అలియా భట్ ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతోన్న 79వ కేన్స్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్నారు. ఈ వేదికగా భారతీయ చిత్ర పరిశ్రమలో పురుషాధిక్యత గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాశంగా మారాయి. భారతీయ బాక్సాఫీస్ వద్ద కేవలం పురుష ఆడియన్స్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని సినిమాలు తీయడాన్ని ప్రశ్నించారు."ప్రపంచవ్యాప్తంగా 'బార్బీ' లాంటి మహిళా ప్రధాన చిత్రాలు భారీ విజయాన్ని సాధిస్తున్నాయి. కానీ, భారత్‌లో మాత్రం ఎప్పుడూ హీరో ప్రాధాన్యం కలిగిన చిత్రాలే ఎక్కువగా తీస్తున్నారు. 75 శాతం సినిమాలు మాస్ ఆడియన్స్‌ను దృష్టిలోపెట్టుకుని రూపొందిస్తున్నారు. మరి మహిళా ప్రేక్షకుల సంగతేంటి? వారికి కావాల్సిన సినిమాలు ఎవరు తీస్తారు?. నేను హీరో ప్రధానంగా సాగే యాక్షన్ సినిమాలు తీయొద్దని చెప్పడం లేదు.. కానీ సినిమాలు ఒక వర్గం కోసం మాత్రమే కాదని.. అందరి కోసం రూపొందించాల్సిన అవసరం ఉందని చెబుతున్నా. సినిమాల్లో ప్రధాన పాత్రలో ఎవరు నటిస్తున్నారనేది ప్రేక్షకులు చూడరు. వాళ్లు కథను మాత్రమే చూస్తారు" అని అలియా స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ అవుతుండగా.. నెటిజన్‌లు అలియాను విమర్శిస్తున్నారు. గతంలో తన భర్త నటించిన 'యానిమల్' హింసాత్మకంగా ఉందని కామెంట్స్ వచ్చినప్పుడు అలియా ఆ చిత్రాన్ని సమర్థించడాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కేన్స్‌లో ఇలా మాట్లాడటం ఎందుకంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు 'ధురంధర్' చిత్రంపై ఆమె ఇప్పటికీ మౌనం వహించడాన్ని కూడా తప్పు పడుతున్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com